క్లుప్తంగా

లలితా పీఠంలో హోమం



ప్రత్యంగిరా భద్రకాళి హోమం చేస్తున్న భక్తులు

సీతంపేట: మాఘ అమావాస్య సందర్భంగా అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో ఆదివారం వేద పండితులు ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో హోమం ఆచరించారు. ఈ హోమం చేయడం వల్ల ప్రతికూల, చెడు ప్రభావాలు నశిస్తాయని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

నందగిరి నగర్‌లో వైద్య శిబిరం



స్థానికులకు వైద్య పరీక్షలు చేస్తున్న హాస్పిటల్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: నందగిరి నగర్ సేవా సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీగాయత్రి హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం నందగిరి నగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి నెలా వివిధ ప్రాంతాల్లో పేదల కోసం ఉచిత మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాలనీలోని సుమారు 100 మందికి బీపీ, సుగర్ పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది డాక్టర్ రమేష్, సిబ్బంది సుజాత, కోటి, సురేష్, నందగిరినగర్ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అష్టపదుల ఆలాపన



అష్టపదులు ఆలపిస్తున్న మండపాక శారద

సీతంపేట: డాక్టర్ మండపాక శారద ఆలపించిన అష్టపదులు సంగీత విద్యార్థులు, ఔత్సాహికులను ఆకట్టుకున్నాయి. విమలకృష్ణ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఏయూ సంగీత విభాగం విశ్రాంత ఆచార్యురాలు డాక్టర్ మండపాక శారద ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో రెండు రోజుల ఉచిత సంగీత శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు అష్టపదులను శ్రావ్యంగా ఆలపించారు. భారతీయ సంగీత చరిత్రలో ప్రప్రథమ వాగ్గేయకారునిగా గ్రంథాల్లో పేర్కొన్న గీత గోవింద కార్యకర్త జయదేవుడు రచనలు అష్టపదులపై అవగాహన కల్పించారు. రాధాకృష్ణుల గాథలు మధురభక్తి భావంతో సాగే ఈ రచనలు నృత్య ప్రదర్శనలతోపాటు సంగీత కచేరీల్లో విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఉచిత సంగీత శిక్షణ దోహదపడుతుందని డాక్టర్ శారద అన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో నూతన 132 కేవీ హెచ్‌టీ టవర్ ఏర్పాటు, కండక్టర్ మార్పుల్లో భాగంగా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ముస్లిం తాటిచెట్లపాలెం, ఆంధ్రజ్యోతి ప్రాంతం, సంతోషిమాత కాలనీ, వైఎస్సార్ కాలనీ, ఏఎస్సార్ నగర్ (టిడ్కో గృహ సముదాయం) ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

కె.కె.రాజుకే మా మద్దతు



క్షత్రియుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.రాజు



బాక్సింగ్ సెంటర్స్ ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న కె.కె.రాజు

- ప్రకటించిన క్షత్రియులు, టీపీటీ కాలనీ అపార్ట్‌మెంట్‌వాసులు, బాక్సింగ్ సెంటర్స్
- వారితో వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త ఆత్మీయ సమావేశం

మద్రిపాలెం: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీచేయనున్న ఆ పార్టీ సమన్వయకర్త కె.కె.రాజుకు క్షత్రియులు పెద్ద ఎత్తున మద్దతు తెలిపారు. 50వ వార్డు మురళీనగర్, మాధవధార, ఎన్‌జీజీవోస్ కాలనీ, పట్టాభిరెడ్డి గార్డెన్స్ ప్రాంతాల్లో నివసిస్తున్న క్షత్రియులు ఆదివారం ఉదయం మురళీనగర్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని, అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాల గురించి వివరించారు. సమావేశంలో కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్, కె.అనిల్‌కుమార్‌రాజు, క్షత్రియ పెద్దలు శ్రీనివాసరాజు, రాజాం రాజు, ఎ.వి.ఎస్.రాజు, ఎ.జి.కె.రాజు, ఎం.ఎ.నరసింహరాజు, బంగార్రాజు, కె.రామచంద్రరాజు, కె.సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.



టీపీటీ కాలనీ అపార్ట్‌మెంట్‌వాసుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.రాజు

ప్రతి కుటుంబానికీ మేలు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డులోని టీపీటీ కాలనీ అపార్ట్‌మెంట్ వాసులు వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజుకు మద్దతు తెలిపారు. ఆదివారం టీపీటీ కాలనీలో అపార్ట్‌మెంట్ వాసులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రతి కుటుంబానికీ మేలు జరిగిందన్నారు. 2024 ఎన్నికల్లో కె.కె.రాజుకు మద్దతు తెలిపినట్లు అపార్ట్‌మెంట్ వాసులు ప్రకటించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, లంకా భాస్కరరావు, పి.గజపతి వర్మ, కె.ప్రసాద్, జి.రమణ, సన్యాశిరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన

సీతంపేట: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు బాక్సింగ్ సెంటర్స్ మద్దతు తెలిపాయి. ఏపీ బాక్సింగ్ అసోసియేషన్ మాజీ రాష్ట్ర కార్యదర్శి జి.వి.రవిరాజు ఆధ్వర్యంలో ఆదివారం అక్కయ్యపాలెం షాదీఖానాలో ఉత్తర నియోజకవర్గ బాక్సింగ్ సెంటర్స్ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కె.కె.రాజు మాట్లాడుతూ విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమం ప్రతి గడపకూ అందించిన సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, విశాఖపట్నం జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు డి.రామకృష్ణారెడ్డి, లక్ష్మణ్ దేవ్, ఐ.వెంకటేశ్వరరావు, డి.నాగేశ్వరరావు, కె.నూకరాజు, కె.జయరాం, బి.అప్పన్నరెడ్డి, ఎన్.నరసింగరావు, మారుతి ప్రసాద్, బి.అప్పలరెడ్డి, జీవా, జోషఫ్, కిరణ్ సాగర్, ఐ.సాయి ప్రసాద్, ఎం.రాజశేఖర్‌రెడ్డి, జె.రాజశేఖర్, అమ్మోరు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు ఆదర్శనీయం



సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కె.కె.రాజు, నాయకులు

సీతమ్మధార: మహిళా విద్యాభివృద్ధికి దేశ తొలి ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే విశేష కృషి చేశారని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు కొనియాడారు. సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆదివారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి కె.కె.రాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమశీలి సాయిత్రిబాయి పూలే ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. మహోన్నత వ్యక్తుల ఆశయ సాధనకు శ్రమిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్, పార్టీ మండల అధ్యక్షుడు కటుమూరి సతీష్, మండల అధ్యక్షులు డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, ఆళ్ల లీలావతి, బర్కత్ అలీ, కె.వి.ఎన్.శశికళ, బీసీ సెల్ అధ్యక్షుడు బి.గంగమహేష్, రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, బులుసు జగదీష్, వసంత అప్పారావు, కిరణ్‌రాజు, రాయుడు శ్రీను, ప్రసాద్, దిడి రమేష్, బోగవల్లి గోవింద్, రేవతిరావు, బి.రాధ, రత్నం, అమ్మాజీ, కృపా తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు

మద్రిపాలెం: ప్రజలు, పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరినీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తుపెట్టుకుని ఆదరిస్తారని, పార్టీలో ఉన్నత పదవులు కల్పిస్తారని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. వీఎంఆర్‌డీఏ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సనపల చంద్రమౌళి అభినందన సభ ఉత్తరాంధ్ర టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ చంద్రమౌళి పార్టీకి చేసిన సేవలను గుర్తుపెట్టుకుని సీఎం జగన్ వీఎంఆర్‌డీఏ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారని కొనియాడారు. సమాజానికి జ్ఞానాన్ని ప్రసాదిస్తున్న ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమైనదన్నారు. అనంతరం చంద్రమౌళిని ఆయన అభినందించారు. సనపల చంద్రమౌళి మాట్లాడుతూ టీచర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారని ప్రతిపక్షాలు అనడంలో ఎటువంటి నిజం లేదన్నారు. టీచర్ వృత్తితో తనకు సంబంధం లేకపోయినా సన్మాన సభ నిర్వహించడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. ఉపాధ్యాయులంతా కలిసి వస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లి నగరంలో తక్కువ ధరకే అందుబాటులో ఒక లేఅవుట్‌గా ఏర్పాటు చేసుకునేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, ఏపీటీఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణరావు, విశాఖ గౌరవాధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కె.వి.ఎల్.ఎన్.ధర్మారావు, అనకాపల్లి ప్రధాన కార్యదర్శి ఎస్.దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు సనపల ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.



వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళిని సత్కరిస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

మేమంతా సిద్ధం

సీతమ్మధార: ఎన్నికల నేపథ్యంలో సిద్ధం పేరుతో ఆదివారం అద్దంకిలో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన భారీ బహిరంగ సభ కార్యక్రమాన్ని వీక్షించేందుకు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో లైవ్ డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. పార్టీ నాయకులందరూ కలిసి సిద్ధం కార్యక్రమాన్ని వీక్షించారు. సభలో ప్రసంగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నాయకులు జేజేలు పలుకుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజారిటీతో గెలిపించేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు.



డిజిటల్ స్క్రీన్‌పై 'సిద్ధం' కార్యక్రమాన్ని వీక్షిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.విజయకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొడవలు, తగాదాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమాజంలో ఎటువంటి నేరాల జోలికి పోకుండా మంచిగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులపై పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద పోలీసులు అప్పగించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంక్షేమ సమితి వితరణ

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు 104 ఏరియాలో బాపూజీనగర్ మహిళా సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కమిటీ అధ్యక్షురాలు ఎస్.విజయదుర్గా చేతుల మీదుగా సభ్యులు అన్నిఅన్నా హోమ్‌కు రూ.5 వేలు విలువ చేసే సామగ్రిని వితరణ చేశారు. మహిళలకు నిర్వహించిన పలు పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు అందించారు. అనంతరం మహిళల కమిటీని ప్రోత్సహిస్తున్న బాపూజీనగర్ సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.రామారావు, బి.అన్నంనాయుడును మహిళలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి జి.వనిత, హారిక, సిహెచ్.జ్ఞానవల్లి, పావని, సంధ్య, జ్యోతి, ధనలక్ష్మి, పద్మ, జోత్స్న, లత, తులసి, స్వాతి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



హోమ్ సభ్యులకు సామగ్రి అందిస్తున్న మహిళా సంక్షేమ సమితి ప్రతినిధులు

ప్రమాదాల జంక్షన్



సీతమ్మధార వేంకటేశ్వరాలయం వద్ద జంక్షన్‌లో ప్రమాదానికి గురైన స్కూటీ

సీతమ్మధార: సీతమ్మధార శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద జంక్షన్ ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రతి రోజు ఇక్కడ ఒక ప్రమాదం జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ఆదివారం ఉదయం ఈ కూడలిలో వాహనాలు ఢీకొట్టుకోవడంతో ఓ యువకుడు నడుపుతున్న స్కూటీ దెబ్బతింది. అతడు ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఈ జంక్షన్‌లో అతి వేగంగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడ ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

ఆసక్తికరంగా స్టోరీ టెల్లింగ్

సీతంపేట: విశాఖ పబ్లిక్ లైబ్రరీ, భారతీయ విద్యా భవన్స్ స్కూల్ సంయుక్తంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలోని మియావాకి సెంటర్‌లో స్టోరీ టెల్లింగ్ కార్యక్రమం నిర్వహించాయి. ప్రఖ్యాత కథకులు సీతా శ్రీనివాస్ ఆఫ్రిక కథ పద్ధతిలో సైన్స్, మ్యాథ్స్ కాన్సెప్ట్‌లను కథల రూపంలో పిల్లలు ఆసక్తిగా వినేలా చెప్పారు. ఆకర్షణీయమైన కథల ద్వారా సమయం, దూరం, గురుత్వాకర్షణ, శిలలు తదితర విషయాలపై వివిధ భావనలను వివరించారు. అద్భుతమైన కథా కళ ద్వారా చక్కటి కథలు చెప్పి పిల్లలను మంత్రముగ్ధులను చేశారు. ఆఫ్రికాలోని గొప్ప జానపద కథల నుంచి ప్రేరణ పొందిన కథలను కథా నైపుణ్యాలతో పిల్లలకు బోధించారు. కథ చెప్పడంతోపాటు సమయానికి తగిన పాటలు, అభినయనంతో చిన్నారుల ఆసక్తిని కథల వైపు మళ్లించారు. అనంతరం ఓరిగామి, వర్క్‌షీట్‌లను నింపడం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 60 మంది చిన్నారులు పాల్గొన్నారు.



ఆసక్తిగా కథలు వింటున్న చిన్నారులు

రోడ్డు పక్కన చెత్తకుప్పలు



నక్కవానిపాలెం రామాలయం వీధిలో పేరుకుపోయిన చెత్త

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం రామాలయం వీధి, టీపీటీ కాలనీలోని పలు వీధుల్లో గల ప్రధాన రహదారుల్లో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పారిశుధ్య అధికారులు పట్టించుకోక పోవడంతో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెలువడుతోందని స్థానికులు వాపోతున్నారు. ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, వ్యర్థాలతో కాలువలు నిండిపోయి ఆందోళన కలిగిస్తున్నాయని చెబుతున్నారు. జీవీఎంసీ పారిశుధ్య అధికారులు దృష్టి సారించి సకాలంలో చెత్త తొలగించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఏడు గుడుల పరిరక్షణకు శాంతియుత నిరసన

సీతమ్మధార: నక్కవానిపాలెం ఏడుగుడుల స్థలం పరిరక్షణ కోసం, ఆలయ ధర్మకర్త ఎరుసు నరసింగరావు ఆగడాలపై గ్రామస్తులు ఆదివారం శాంతియుతంగా ర్యాలీ, నిరసన కార్యక్రమం చేపట్టారు. 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి మాట్లాడుతూ నక్కవానిపాలెం గ్రామ ప్రజలకు విలువ ఇస్తున్నానని, గ్రామ ప్రయోజనార్థం ఏడుగుడులను గ్రామానికి ఇవ్వాలన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు డి.వి.ఎస్.ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నక్కవానిపాలెం గ్రామ దేవత ఆలయంలో పూర్వీకుల నుంచి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పూజలు జరుగుతున్నాయన్నారు. 40 ఏళ్లుగా గ్రామ కమిటీకి.. గుడి వెనుక నివసిస్తున్న ఎరుసు నరసింగరావు కుటుంబ సభ్యులకు మధ్య ఆలయ విషయమై వివాదం కోర్టులో ఉందన్నారు. ఇటీవల ఏడుగుడుల స్థలంలో భవనం నిర్వహిస్తున్న బిల్డర్ సహాయంతో రాత్రి వేళ అక్రమంగా రహదారి నిర్మించారని తెలుసుకొని గ్రామ కమిటీ సభ్యులు, స్థానికులందరూ అతడిని నిలదీయగా.. 'నా స్థలంలో నేను రోడ్డు వేస్తాను. మీకు సంబంధం లేదు'అని కోర్టు నోటీసుల పేరుతో బెదిరిస్తున్నట్లు ఆరోపించారు.

'మా స్థలంతో గ్రామ కమిటీకి సంబంధం లేదు'

సీతమ్మధార: నక్కవానిపాలెం గ్రామ కమిటీకి.. తమ స్థలానికి ఎటువంటి సంబంధం లేదని ముత్యాల అమ్మవారి ఆలయ(ఏడు గుడులు) ధర్మకర్త ఎరుసు నరసింగరావు స్పష్టం చేశారు. నక్కవానిపాలెంలోని ఏడుగుళ్ల వద్ద ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 1916లో మా తాత 57.5 సెంట్లు భూమి కొన్నారని, ఈ స్థలంలో సొంత నిధులతో అమ్మవారి గుడులు నిర్మించామని తెలిపారు. నక్కవానిపాలెం గ్రామ కమిటీ వారు అమ్మవారి గుడులను గ్రామానికి అప్పగించాలని అప్పట్లో కేసులు వేయగా.. కోర్టు కొట్టేసిందన్నారు. దుంగి ప్రసాద్‌రెడ్డి, దుంగి దిలీప్, దుంగి రమేష్ అనే వ్యక్తులు రూ.10 లక్షలు ఇమ్మని తనను డిమాండ్ చేశారని, లేని పక్షంలో గ్రామస్తులమంతా వచ్చి వివాదం సృష్టిస్తామని బెదిరించినట్లు చెప్పారు. మా గుడికి వందేళ్ల చరిత్ర ఉందని, గ్రామ కమిటీకి మా స్థలానికి ఎటువంటి సంబంధం లేదన్నారు.

సీసీ కెమెరాలతో ఇంటికి భద్రత

సీతమ్మధార: అపార్ట్‌మెంట్స్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, తద్వారా మరింత భద్రత ఏర్పడుతుందని క్రైం డీసీపీ వెంకటరత్నం సూచించారు. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో ఆదివారం దొంగతనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అపార్ట్‌మెంట్ వాసులకు దొంగతనాల కట్టడిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు కాల్ చేసి తెలియజేయాలన్నారు. అపార్ట్‌మెంట్‌కు వచ్చిన వారి వివరాలతోపాటు ఆధార్ కార్డును పరిశీలించాలని, ఇంటికి వచ్చి వెళ్తున్న వారి వివరాలు తెలుసుకొని పంపించాలన్నారు. ఇంట్లో విలువైన బంగారు నగలు, నగదు ఉంచరాదని, బ్యాంక్‌లో భద్రపరచడమే మేలని సూచించారు. ఊళ్లు వెళ్లేటప్పుడు ఇంటికి తాళాలు జాగ్రత్తగా వేసుకుని పక్కన ఉన్న వారికి, పోలీస్‌లకు తెలియపరచాలన్నారు. సీసీ కెమెరాలు వంద మంది పోలీసులతో సమానమని, వాటి ఏర్పాటు చేయడం వల్ల ఇంటికి రక్షణగా ఉంటాయని చెప్పారు. చోరీలు జరిగినప్పుడు పోలీసులకు సహకరించాలని స్థానికులను డీసీపీ వెంకటరత్నం కోరారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటరావు, సీఐ. శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



అపార్ట్‌మెంట్ వాసులకు అవగాహన కల్పిస్తున్న క్రైం డీసీపీ వెంకటరత్నం

విశాఖ ఎంపీ బరిలో పరవస్తు సూరి

సీతంపేట: తెలుగు భాష పరిరక్షణ కోసం సాహితీ, కళా సంస్థల తరఫున రానున్న ఎన్నికల్లో విశాఖ ఎంపీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్టు తెలుగు దండు వ్యవస్థాపక అధ్యక్షుడు పరవస్తు ఫణిశయన సూరి తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన తెలుగుదండు ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాతృభాషలోనే ప్రాథమిక విద్యా బోధన కొనసాగించాలని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించాలని, ప్రత్యేక హోదా సాధన, పోలవరం ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వం పూర్తి చేసి రాష్ట్రానికి అప్పగించాలన్న ప్రధాన డిమాండ్లే ఎజెండాగా ఏడు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజలకు, యువతను చైతన్యవంతులను చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో రచయిత డి.వి.సూర్యారావు, జి.వి.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరవస్తు ఫణిశయన సూరి

పొత్తులతో జనసేన-టీడీపీ ఓటమి ఖాయం

తాటిచెట్లపాలెం: పొత్తులతోనే జనసేన-టీడీపీ ఓటమి ఖాయమైపోయిందని ప్రజాశాంతి పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జె.రవికుమార్ అన్నారు. రైల్వే న్యూకాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం ఖరారు చేసుకున్న పొత్తులతో వీరి బంధం బట్టబయలైందని, బీజేపీ, టీడీపీ, జనసేనలు కలిసినా వారికి ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. రానున్న ఎన్నికల్లో విశాఖపట్నం నుంచి తమ పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్ ఎంపీగా పోటీచేస్తున్నారని, విశాఖ అభివృద్ధికి ఆయనను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ కో ఆర్డినేటర్ బాబోజీరావు, మేకల శుభకర్ హెప్సీబా, మేకల విలియం జేమ్స్, శామ్యూల్, మోరిస్, పోగుల సైమన్, రాధ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవికుమార్

గ్లకోమాపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి సిబ్బంది

బీచ్ రోడ్డు: ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ ర్యాలీలో గ్లకోమా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గ్లకోమా అనేది కంటి ఒత్తిడి సంబంధిత దృష్టి లోపం కలిగించే వ్యాధి అని, ఇదీ కొన్ని రకాల స్టెరాయిడ్స్ వాడకం వల్ల వస్తుందని వైద్యులు తెలిపారు. ఈ వారోత్సవాలను స్టెరాయిడ్ ప్రేరిత గ్లకోమా అనే అంశంతో చేపట్టారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

మద్రిపాలెం: భార్యాభర్తల మధ్య ఉన్న విభేదాల కారణంగా భర్త ఉరివేసుకుని మృతిచెందిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం సూర్యానగర్‌లో డి.రాజశేఖర్(37) అనే వ్యక్తి భార్య, కుమార్తెతో కలిసి నివసిస్తున్నాడు. మృతుడు ఓ ప్రైవేట్ సంస్థలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి 2015లో వివాహం జరిగింది. అప్పటి నుంచి తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం గొడవ జరగడంతో మనస్తాపం చెందిన రాజశేఖర్ వెంటనే గదిలోకి వెళ్లి తలుపులు మూసుకుని ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.